ఏడిపింఛన్

నర్సాపూర్‌లో పోస్టాఫీసు ద్వారా పెన్షన్ పొందే లబ్ధిదారుల అవస్థలు

నెలలో నాలుగు రోజులే ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పోస్టల్ శాఖ

7



నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు రోజుకో పరీక్ష నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏకైక సెంటర్‌లో 247 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మెదక్ జిల్లాకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 340 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తారని, విద్యార్థులు గంట ముందే చేరుకోవాలని డీఈవోలు వెంకటేశ్వర్లు, రాధాకిషన్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.



విజన్ 2047

నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యం

- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం
- 'నిమ్జ్'తో 15 లక్షల మందికి ఉపాధి
- కొత్త నర్సింగ్ కాలేజీలు, ఆస్పత్రుల మంజూరు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో మంత్రి దామోదర్



సంగారెడ్డిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సిఆర్.దామోదర్ రాజనర్సింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం నాడు అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ తెలంగాణకు ఒక భగవద్గీత అని, తెలంగాణ రూపు రేఖలనే మార్చేస్తుందని అన్నారు. ఆడ బిడ్డలకు అండదండగా ఉంటూ ఆర్టీసిలో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. మంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే..

1,18,773 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 218 కేంద్రాల ద్వారా 22,888 మంది రైతుల నుంచి 1,18,773 మెట్రిక్ టన్నుల దొడ్డువడ్లు, 6,271 మెట్రిక్ టన్నుల సన్నవడ్లు సేకరించాం. ఇందుకు సంబంధించి 17,854 మంది రైతులకు రూ. 216.65 కోట్లు చెల్లించాం. సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించడం జరిగింది. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నాం.

రూ.41.45 కోట్ల రైతు బీమా

రైతు బీమా పథకం పథకం కింద జిల్లాలో 2.48 లక్షల మంది రైతులను నమోదు చేసుకున్నారు. 2024-25లో మృతిచెందిన 829 మంది రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రూ. 41.45 కోట్లు ఖాతాలో జమచేశాం. పంట రుణమాఫీలో భాగంగా 1,04,416 మంది రైతు కుటుంబాలకు రూ. 910.40 కోట్ల రూపాయల రుణ మాఫీ చేశాం.

మూడు నెలల రేషన్ ఒకేసారి

జిల్లాలో 846 రేషన్ దుకాణాల ద్వారా 3,81,017 తెల్లకార్డుల ద్వారా 13,8,489 మంది లబ్ధిదారులకు ఉచితంగా 8,335 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. కొత్త మెడికల్, నర్సింగ్ కాలేజీలు, ఆస్పత్రులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యతను నెరవేరుస్తున్నది. అందోల్‌లో రూ.43 కోట్లతో నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకోవడం జరిగింది. రూ.60 కోట్లతో కొత్తగా వంద పడకల ఆస్పత్రి, 50 పడకల మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం, వట్‌పల్లిలో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఐదు కొత్త పీహెచ్‌సీల నిర్మాణానికి చర్యలు తీసుకున్నానం. అత్యవసర వైద్య సేవల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో

మిగతా 8వ పేజీలో



ప్రభాకర్‌రెడ్డి.. నీది కేసీఆర్ దగ్గర అటెండర్ డ్యూటీ

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదని తెలుసుకో

- బీఆర్ఎస్ హయాంలో నీ గొంతు మూగబోయిందా?
- పదేళ్లు మెదక్ ఎంపీగా ఎన్ని నిధులు తెచ్చావు?
- మీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను స్వేచ్ఛగా కలిశారా?
- మా సీఎం రేవంత్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఓడినవారు కూడా స్వేచ్ఛగా కలుస్తున్నారు
- కేసీఆర్ వద్ద వంగి దండాలు పెట్టే పొజిషన్ నీది
- అలాంటి నువ్వు కాంగ్రెస్ పార్టీకి, సర్కారుకు సలహాలిస్తావా!
- మీ పార్టీలో లుకలుకల గురించి కేసీఆర్‌కు ఈ బోడి సలహాలిచ్చుకో
- దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూన్ 2: 'ప్రభాకర్‌రెడ్డి.. నీది కేసీఆర్ దగ్గర అటెండర్ డ్యూటీ చేసే పొజిషన్. ఆయన కూర్చోమంటే కూర్చుంటావు.. నిల్చోమంటే నిల్చుంటావు. నువ్వా సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించేది. నీ స్థాయి తెలుసుకొని మాట్లాడు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తుంటే నీ గొంతు మూగబోయిందా' అని దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఉదయం సిద్దిపేటలో కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను జగ్గారెడ్డి తీవ్రంగా ఖండించారు. పదేళ్ల మెదక్ ఎంపీగా పనిచేసి ఎన్ని నిధులు తెచ్చావో.. ఎంత అభివృద్ధి చేశావో చెప్పాలని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో నీతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్‌ని కలిసే స్వేచ్ఛ ఉండేదా అని అడిగారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు ఓడిన వారు కూడా స్వేచ్ఛగా కలిసే అవకాశం ఉందన్నారు. కేసీఆర్ దగ్గర నీ పొజిషన్ అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. నీ బీఆర్ఎస్ పార్టీలోనే అంతర్గత కుమ్ములాటలు, లుకలుకలు చాలా ఉన్నాయని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. అవసరమైతే నీ బోడి సలహాలు కేసీఆర్‌కు ఇచ్చుకోమంటూ జగ్గారెడ్డి దుయ్యబట్టారు.



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంక్షేమంలో అగ్రగామి

ఎన్నో ప్రయాసలకోర్చి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం

సంక్షేమ పథకాల అమలుతో అభివృద్ధి పథంలో మెదక్ జిల్లా : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు

మెదక్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలతో మెదక్ జిల్లా అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తోందని రాష్ట ప్రభుత్వ సలహాదారు కేశవరావు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, పారదర్శక, సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా జిల్లాలో 2.38 కోట్ల మంది మహిళలు రూ.69 కోట్ల ప్రయోజనం పొందారని ఆయన పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 1,29,500 మంది వినియోగదారులకు రూ.54.24 కోట్లు సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం పేద రైతులకు భరోసా అందివ్వడం లేదని ప్రతిపక్షాలు యాగీ చేస్తుండడం సమంజసం కాదని కేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా యాసంగిలో 2,26,970 మంది రైతుల ఖాతాల్లో రూ.140.70 కోట్లు జమ చేసినట్లు వివరించారు. జిల్లాలో రైతు రుణమాఫీ పథకం ద్వారా ఇప్పటివరకు 87,491 మంది రైతన్నలకు రూ.645 కోట్ల రుణాలను మాఫీ చేశామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 1,26,658 మంది వినియోగదారులకు రూ. 500లకే 4,68,195 వంటగ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు రూ.13.18 కోట్ల సబ్సిడీ లభించిందని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2,16,716 కుటుంబాలకు ఇప్పటివరకు రేషన్‌లో 13,922 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా 3,800 రేషన్‌కార్డులు జారీచేశాన్నారు. జిల్లాలో ఈ యాసంగిలో ఇప్పటివరకు 70,815 మంది రైతుల నుంచి 2,95,703 మెట్రిక్ టన్నుల

మిగతా 8వ పేజీలో



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కేశవరావు



జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు

రిజిస్ట్రేషన్లు.. చకచకా

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ప్రారంభమైన స్లాట్ బుకింగ్ విధానం

మెదక్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్, బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి నూతన విధానంలో రిజిస్ట్రేషన్లు చేశారు.

ఒక్కో సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు

నూతన విధానంలో ఒక్కో సబ్‌రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఉదయం 24 స్లాట్లు, మధ్యాహ్నం 24 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయనున్నారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు ఇచ్చిన సమయంలో వస్తే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. ఆలస్యమైతే మరుసటి రోజు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఐదు డాక్యుమెంట్లను స్లాట్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో మాడ్యూల్‌ను ఉపయోగించుకుని ప్రజలు సొంతగా డాక్యుమెంట్లు తయారు చేసుకోవడానికి వీలుంటుంది. మొదటగా సేల్ డీడ్ డాక్యుమెంట్ల కోసం ఈ సౌకర్యం కల్పించినా, ఇది ఐచ్ఛికం మాత్రమే. కొత్త విధానంపై మెదక్ సబ్ రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలనే ప్రభుత్వం నూతన విధానం అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కంది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది

తొలి రోజు ఆటంకాలు..

కంది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు తొలిరోజు తీవ్ర ఆటకం కలిగింది. సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌లు ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర ఆరు గంటల వరకు నెట్‌వర్క్ మొరాయించింది. 106 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ 51 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. ఇందులో మొత్తం 24 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. ఇదే ప్రాంగణంలో ఉన్న సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 20 స్లాట్ బుక్ చేసుకోగా 13 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయని సబ్ రిజిస్ట్రార్‌లు తెలిపారు.



అరుణ నివాసం ఉండే రేకుల ఇళ్లు

రేకుల ఇంటికి రూ.9వేల కరెంటు బిల్లు

చేగుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూలీ చేసుకొని రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద మహిళకు రూ. 10వేలు కరెంటు బిల్లు వచ్చింది. మెదక్ జిల్లా చేగుంటలోని సీఎంఆర్ కాలనీలో నివాసముంటున్న నూతనకంటి అరుణకు (సర్వీస్ నంబర్ 04660) ఉచిత కరెంటు పథకం కింద మార్చి నెల వరకు జీరో బిల్లు వచ్చింది. కానీ, ఏప్రిల్ నెలకు మాత్రం రూ. 9,073 బిల్లు ఇచ్చిన అధికారులు, కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. రెండు నెలలుగా ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నానని, ఇంటి దగ్గర ఉండటమే లేదని ఆమె వాపోయారు. కరెంటు వాడకుండానే వేలల్లో కరెంట్ బిల్లు రావడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ భరత్‌ను వివరణ కోరగా ఇంటికి సంబంధించిన విద్యుత్ సరఫరా వైర్ల కనెక్షన్‌లో లోపం కారణంగానే సమస్య తలెత్తిందని, ఉన్నతాధికారులకు తెలియజేశామని పేర్కొన్నారు.



కరెంటు బిల్లుతో అరుణ

మధ్యాహ్న భోజనం... మరింత పకడ్బందీగా

- విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు
- రేపు హెచ్‌ఎం, కార్మికులకు శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు మరో పది రోజుల్లో తెరుచుకోనున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం మరింత పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈమేరకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా మధ్నాహ్న భోజనం అమలులో భాగంగా జిల్లా నుంచి ఇద్దరు ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు వంట కార్మికులకు హైదరాబాద్‌లో ఈ నెల 4న శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందినవారు జిల్లాస్థాయిలో.. ఆ తర్వాత కాంప్లెక్స్ స్థాయిలో మిగతావారికి శిక్షణ ఇవ్వనున్నారు.

1,08,528 మంది విద్యార్థులు

సంగారెడ్డి జిల్లాలో 1,218 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్నాహ్న భోజనం అమలవుతున్నది. మొత్తం 1,850 మంది వంట కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,08,528 మంది విద్యార్థులకు మధ్నాహ్న భోజనం పంపిణీ చేస్తున్నారు. ఇకపై మధ్యాహ్న భోజనం తయారీకి నాణ్యమైన సామగ్రిని వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్కారు బడుల్లో ఆహార భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రత పాటించాలని, సూచించింది. ప్రతీ నెల 5 వ తేదీ లోపు మధ్నాహ్న భోజనం బిల్లులను పంపాలని, జిల్లా, మండల కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించింది. కొత్త మార్గదర్శకాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



కొత్త మార్గదర్శకాలు ఇవే..

జిల్లాలో ఏటా 5 శాతం చొప్పున ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆహార నమూనాలను తీసి ప్రభుత్వ ఫుడ్ రీసెర్చ్ ల్యాబోరేటరీకి పరీక్షల నిమిత్తం పంపాలి. నిర్దేశిత ప్రమాణాలు లేనట్లు తెలితే చర్యలు తీసుకోవాలి. పాఠశాల పెరటి తోటలను పెంచి తాజా ఆకుకూరలతో వంటలు వండాలి. ఎల్‌పీజీ వాడేలా ప్రోత్సాహించాలి. విద్యార్థుల్లేని బడులను ఎంఐఎస్ పోర్టల్ నుంచి తొలగించాలి.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భార్యపై దాడి చేసి ఆమె మృతికి కారకుడైన భర్తను కుకునూరుపల్లి పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల యశోద తలపై భర్త మల్లేశం పారతోతో తీవ్రంగా కొట్టి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన యశోదను ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కాగా ఆదివారం సాయంత్రం నిందితుడు హైదరాబాద్‌కు వెళ్లేందుకు కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద ఉన్నాడని సమాచారమందుకున్న తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తానే భార్య యశోదపై దాడి చేసి మృతికి కారణమైనట్టు ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పీర్లపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన రాయవరం కిష్టమ్మకు చిన్నకుమారుడు రాయరామ్ కనకయ్య(40) మద్యానికి బానిస కావడంతో అతడి భార్య సుజాత తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. ఆదివారం సాయంత్రం కనకయ్య పీర్లపల్లిలోని తన చెల్లెలు వెంకటమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కాలినడకన వెళ్లాడు. అయితే పీర్లపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావి వద్ద అతడు మద్యం తాగతుండడాన్ని గమనించిన స్థానికులు అతడిని విచారించగా తన చెల్లెలి ఇంటికి వెళ్తూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు బావివద్దకు వచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో అతడు కాలుజారి బావిలో పడ్డాడని కొందరు చెల్లెలు వెంకటమ్మకు ఫోన్‌ద్వారా సమాచారమందించారు. బావిలో ఆదివారం రాత్రి గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం బావిలో కనకయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతదేహంగా..

కొండపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అదృశ్యమైన ఓ వృద్ధుడు మృతదేహంగా లభ్యమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దమ్మక్కపల్లికి చెందిన జాలిగామ మల్లయ్య(80) అనే వృద్ధుడు 3రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం కొండపాక శివారులోని బతుకమ్మ చెరువు సమీపంలో పడి ఉన్న మల్లయ్యను గమనించిన కొందరు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

గజ్వేల్ రూరల్/పాపన్నపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు. గజ్వేల్ మండలంలో జరిగిన రెండు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా, పాపన్నపేట మండలంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..

గజ్వేల్ మండలంలో..

మండలంలోని ప్రజ్ఞాపూర్ శివారులో గల పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో బైక్‌ను డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్కుక్ మండలం పాతూరుకు చెందిన కొక్కొండ వెంకటేశ్(38) కూరగాయలు సాగు చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం కూరగాయలను తీసుకొని బైక్‌పై పాతూరు మార్కెట్‌కు వచ్చాడు. తిరిగి పాతూరులోని పొలానికి వెళ్తుండగా, మార్గమధ్యలో మహాలక్ష్మి రబ్బర్ పరిశ్రమ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వెంకటేష్ బైక్‌ను ఢీకొంది. తీవ్రగాయాలైన వెంకటేష్‌ను కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్‌లు తెలిపారు. మరో ఘటనలో.. గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ దారిలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బెజుగామ గ్రామానికి చెందిన ముత్యాల పరశురాములు(32)కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. వారు జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం బొంబాయికి వెళ్లారు. వారం క్రితం పరశురాములు దంపతులు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(లక్ష్మాపూర్)లో ఉండే అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం రాత్రి బైక్‌పై గజ్వేల్ నుంచి లక్ష్మాపూర్‌లో ఉండే అత్తగారింటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రింగు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పరశురాములు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.



లునావత్ సురేష్ (ఫైల్)

పాపన్నపేట మండలంలో..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోమ్లా తండాకు చెందిన లునావత్ సురేష్(28)వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 28న పాపన్నపేటకు వెళ్తూ నార్సింగి వద్ద అదే గ్రామానికి చెందిన నీలగిరి దుర్గయ్య ద్విచక్ర వాహనంపై ఎక్కాడు. నార్సింగి గ్రామ శివారులోకి చేరుకోగానే ముందు వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను వారి వాహనం వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వాహనం వెనక కూర్చున్న సురేష్ కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం సురేష్‌ను హైదరాబాద్‌లోని గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి మారోణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రెండిళ్లలో చోరీ

రాయపోల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని తాళాలు వేసిన రెండిళ్లలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రఘుపతి వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మల్లయ్య ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఓ శుభకార్యం నిమిత్తం ఊరికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం, బీరువా తాళాలు పగలగొట్టి రూ. 56 వేలు, 18 తులాల కాళ్ల వెండి పట్టీలు అపహరించారు. మరో ఘటనలో కొత్తపల్లికి చెందిన గంగాధర భిక్షపతి కుటుంబం కొంతకాలంగా తుర్కపల్లిలో నివాసం ఉంటున్నారు. మే 22న బంధువుల పెళ్లి నిమిత్తం కొత్తపల్లికి వచ్చి 23న ఇంటి తాళం వేసి తిరిగి తుర్కపల్లి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, బీరువాల తాళాలు పగులగొట్టి రూ. 17,500, బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బస్సులో ఐదుతులాల బంగారు నగలు అపహరణ

నర్సాపూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి బోయినపల్లికి బస్సులో వెళ్తుండగా నర్సాపూర్ సమీపంలో బ్యాగులో ఉన్న 5తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. సోమవారం ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని తిర్మలగిరిలో నివాసముండే మాధవి ఇద్దరు కూతుళ్లతో కలిసి తూప్రాన్‌లోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు ఆదివారం వచ్చి తిరిగి సాయంత్రం నర్సాపూర్ మీదుగా స్వస్థలం వెళ్లేందుకు నర్సాపూర్‌లో బాలనగర్ బస్సు ఎక్కారు. వారి వెంట బ్యాగులో 5తులాల బంగారు నగలు కూడా ఉన్నాయి. బస్సు దిగగానే బ్యాగులో ఉన్న నగల హ్యాండ్ బ్యాగు కనిపించకపోవడంతో అంతా వెతికినా లాభం లేకపోయింది. అప్పటికే చీకటి పడటంతో సోమవారం వచ్చి నర్సాపూర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈనెల 5న బ్రహ్మాండమైన విడుదల




సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంగీత 70 - ఆర్.సి.పురం
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి
ఈశ్వర్ 70 - అత్తాపూర్
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్
శివశక్తి 70 - కాప్రా
శ్రీసాయిరామ్ 70 - మల్కాజ్‌గిరి
యాదగిరి - సంతోష్‌నగర్
గోకుల్ 70 ఎంఎం - ఎర్రగడ్డ

ఈనెల 6న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
DEEPA ARTS

ఈనెల 6న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

BLOCK BUSTER భీబత్సం



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

ఈనెల 6న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
11.00,2.15,6.00,9.00

విజయవంతమైన 3వ వారం



నేడే చూడండి



SUPER HIT
సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.45
తారకరామ 70 - కాచిగూడ 11.15,6.00

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 6న బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 ఎ ఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినిప్లెక్ 70 ఎ/సి- మూసాపేట్
ఎ.ఎం.బి సినిమాస్ 70 - గచ్చిబౌలి

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 6న బ్రహ్మాండమైన విడుదల



మహాలక్ష్మి 70 - కొత్తపేట
విజయలక్ష్మి-ఎల్.బి.నగర్
లక్ష్మీకళ - మూసాపేట్
తాళ్కూరి 70 - ఇసిఐఎల్

SAI LAKSHMI GANAPATHI MOVIE CREATION 9848028739



సిద్దిపేట కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ మహేందర్





మెదక్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న రాహుల్‌రాజ్

అట్టహాసంగా 'అవతరణ' వేడుకలు

ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మెదక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ మహేందర్ జెండాను ఎగురవేశారు.

- సంగారెడ్డి క్రైం/సిద్దిపేట కలెక్టరేట్/మెదక్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

రైల్వేలైన్ సమస్యల పరిష్కారానికి ఎంపీ చర్యలు



రైల్వే అధికారితో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ రైల్వేలైన్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రెండు రోజుల క్రితం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను ఎంపీ రఘునందన్‌రావు కోరిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఎంపీ సోమవారం రైల్వేశాఖ సీనియర్ ఇంజనీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా తెల్లాపూర్‌లో ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద వరదనీరు సజావుగా వెళ్లడం, నూతన అండర్ బ్రిడ్జి నిర్మాణం నిర్మించడంపై చర్చించారు. అలాగే తెల్లాపూర్ నుంచి ఎంఐజీ వైపుకి ఫుట్ ఓవర్ నిర్మాణం, కొల్లూరు నుంచి వెలిమెల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు రైల్వే క్రాసింగ్ నుంచి కొనసాగింపును త్వరగా నిర్మించడంపై సమీక్షించారు.

దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్‌గా గాంధారి నరేందర్‌రెడ్డి



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్‌గా తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గాంధారి నరేందర్‌రెడ్డిని నియమించారు. 25 మంది సభ్యులతో కూడిన ఆత్మ కమిటీని నియమించింది. గురువారం ప్రమాణస్వీకారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి, ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ దుబ్బాక నియోజవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన ప్రదర్శనకు మిర్జాపల్లి ఉపాధ్యాయుడు ఎంపిక



బాలరాజు

చిన్నశంకరంపేట జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి విద్యా పరిశోధక ప్రదర్శనకు చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు బాలరాజు ఎంపికైనట్లు ఎంఈవో పుష్పవేణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే పాఠశాల అభివృద్ధి విద్యా బోధనపై ప్రదర్శించడానికి ఉత్తమ ఉపాధ్యాయుడు ఎంపిక హర్షణీయమన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ నుంచి ఎంపిక కావడం గర్వకారణమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా రామాయంపేట యువజ్యోతి టీం

రామాయంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో రామాయంపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి విజేతగా నిలిచారు. అండర్-17 విభాగంలో రామాయంపేట యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ టీం నిజామాబాద్ జట్టుతో ఫైనల్‌లో తలపడి విజేతగా నిలిచింది. యువజ్యోతి జట్టుకు నిర్వాహకులు, నాయకులు కప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కెప్టెన్ నవదీప్, శ్యామ్‌ను సన్మానించారు.



జహీరాబాద్ సమీపంలోని హోతి(కే) గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో తవ్వుతున్న ఎర్రరాయి

సహజ సంపదకు ఆపద

దర్జాగా ఎర్రరాయి తవ్వకాలు... మట్టినీ వదలని మైనింగ్ మాఫియా

జహీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతమంటేనే ఎర్రరేగడి భూములకు, ఎర్ర రాయికి ప్రసిద్ధి. అలాంటి ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఈ ఎర్ర రాళ్లను మైనింగ్ మాఫియా దర్జాగా తవ్వేస్తూ కాసుల వేట కొనసాగిస్తున్నది. ప్రభుత్వ ప్రైవేటు భూములనే తేడాలేకుండా దర్జాగా పెద్ద పెద్ద గోతులు తవ్వి రాయిని తీస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు నాయకుల సహకారంతో అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన (రాయల్టీ) పన్నును ఎగ్గొడుతూ సహజ సంపదను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవైతే చాలు. ఆ రోజుల్లో మైనింగ్ వ్యాపారులకు అడ్డుఅదుపు లేకుండా పోతున్నది. రాత్రి, పగలు లేకుండా రవాణా చేస్తున్నారు.



శేఖాపూర్ శివారులో మట్టిని తవ్వడంతో కరుగుతున్న ఏనె

భూములను లీజుకు తీసుకుని..

జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి మండలాలు ఎర్ర నేలలు కావడంతో సహజ సిద్ధంగా ఇక్కడ ఎర్ర రాయి దొరుకుతుంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యామ్తాబాద్, కల్‌బేమల్, హద్నూర్, గణేష్‌పూర్, కాశీంపూర్, ఆనెగుంట, హోతి(కే), చిన్నహైదరాబాద్, చున్నంబట్టి తాండ, మొగుడంపల్లి, పర్వతాపూర్. మిర్జంపల్లి, జాడిమల్కాపూర్, పడియాల్‌తాండ, ఉప్పర్‌పల్లి, మన్నాపూర్, విట్టునాయక్ తండా, శేఖాపూర్, పిచేర్యాగడి, వెంకటాపూర్, బడంపేట తదితర గ్రామాల పరిధిలో విస్తృతంగా ఎర్రరాయి నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా అనుమతికి మించి ఎర్రరాయిని తవ్వుతూనే ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లోతుకు తవ్వి దోచేస్తున్నారు. కొందరు అక్రమార్కులు ఎలాంటి పెట్టుబడి లేకుండానే రైతులకు ఎంతోకొంత చెల్లించి వ్యవసాయభూములను లీజుకు తీసుకుంటున్నారు. సుమారు 50 నుంచి 100 ఫీట్ల లోతుగా అత్యాధునిక కోత మిషన్ ద్వారా ఎర్రరాయిని తవ్వి తీస్తున్నారు. అనంతరం ఆ గుంతలను అలాగే వదిలేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గుంతల్లో చేరిన నీటిలో పశువులను మేపడానికి వెళ్లిన కాపరులు పడి మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. ఇలా ఇష్టారీతిన తవ్వితీసి, ఒక్కోరాయిని రూ.15-25 వరకు అమ్ముకుంటూ కాసులు పోగేసుకుంటున్నారు. రాత్రి వేళల్లోనే ఎర్రరాయిని తరలిస్తూ, ఫిర్యాదు చేసిన వారిని మైనింగ్ మాఫియా భయభ్రాంతులకు గురిచేస్తున్నది. రాయినే కదా విలువైన ఎర్ర మట్టిని సైతం కాసుల కక్కుర్తితో కరిగించేస్తున్నారు.



తవ్విన ఎర్ర మట్టి

చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా ఎర్రరాయి తీస్తున్న విషయం, మట్టిత రలింపు తదితరాలు మా దృష్టికి వచ్చాయి. ఎక్కడెక్కడ తీస్తున్నారనే విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బందితో వెళ్లి చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా తవ్వితే ఎంతటి వారినైన ఉపేక్షించబోం.

- రాంరెడ్డి, జహీరాబాద్ ఆర్డీవో

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ భూబాధితుడికి ఎట్టకేలకు పరిహారం

- దశాబ్ద కాలం తర్వాత చెక్కు అందజేత
- రెవెన్యూ, పోలీసు అధికారుల జోక్యంతో అంగీకరించిన రైతు



మల్లేశంకు చెక్కును అందజేస్తున్న ఆర్డీవో పాండు

పుల్‌కల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ నిర్మాణంలో భూమి కోల్పోయిన బాధితుడికి ఎట్టకేలకు పరిహారం చెక్కును అందజేశారు. 2012లో సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ నిర్మాణంతో సర్వే నంబర్ 40/ఇలో గొల్ల మల్లేశం 3.05 ఎకరాల భూమిని కోల్పోయారు. ఈ భూమికి అప్పట్లో రూ.8,70,438 లక్షలు మంజూరవగా, పరిహారం సరిపోదంటూ బాధితుడు మల్లేశం చెక్కు తీసుకోకుండా నిరాకరించారు. భూమిని జేఎన్టీయూకు ఇచ్చేది లేదంటూ కోర్టును ఆశ్రయించగా, మంజూరైన పరిహారం డబ్బు ఆర్డీవో ఖాతాలో జమ చేశారు. అయితే, ఇటీవల కళాశాలలో తన భూమిలో పనులు చేపడుతున్న విషయం తెలుసుకుని మల్లేశం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి ఆందోళన నిర్వహించారు. ఈ విషయమై జోగిపేట సీఐ అనిల్‌కుమార్, చౌటకూర్ మండల నయాబ్ తహసీల్దార్ అనుదీప్ జోక్యం చేసుకుని బాధితుడు గొల్ల మల్లేశంతో మాట్లాడి నచ్చజెప్పారు. దీంతో ఎట్టకేలకు పరిహారం చెక్కును తీసుకునేందుకే అంగీకరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం పరిహారం చెక్కును గొల్ల మల్లేశంకు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు అందజేశారు.

శభాష్ సలీం



నగదు, బంగారం యాదగిరికి అందజేస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రయాణికుడు బస్సులో ప్రయాణిస్తూ ఏడు తులాల బంగారం, రూ. 2.50లక్షలు ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయి దిగి వెళ్లిపోగా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ దానిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భువనగిరి నుంచి సోమవారం సాయంత్రం గజ్వేల్ వైపు వస్తుండగా బస్సులో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బంటు యాదగిరి తన బ్యాగును మరిచిపోయి జగదేవ్‌పూర్‌లో దిగారు. బ్యాగును వదిలేసి వెళ్లిపోవడంతో అది గమనించిన డ్రైవర్ సలీం, కండక్టర్ ప్రకాష్‌కు చెప్పాడు. ఇద్దరు కలిసి ఆ బ్యాగును తీసి చూడగా దానిలో బంగారం నగదు ఉండడంతో ఆ బ్యాగును జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వారు యాదగిరికి సమాచారమందించి బ్యాగును అందజేశారు.

జీజీహెచ్‌లో కరెంట్ పోయినా..నో టెన్షన్!

క్షణాల్లో జనరేటర్ ఆన్

జహీరాబాద్ ఘటనతో అప్రమత్తం

సంగారెడ్డి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పవర్ కట్ సమయంలో జనరేటర్ ఆన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అటువంటి సంఘటన తిరిగి పునరావృతం కాకుండా విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) అధికారులు ఆదిశగా చర్యలకు ఉపక్రమించారు. ఒకవేళ పవర్ కట్‌తో విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే జనరేటర్ ఆన్ అయ్యేలా సిస్టంను ఏర్పాటు చేశారు. గతంలో పవర్ కట్ ఉంటే జనరేటర్ వద్దకు ఎలక్ట్రిషన్ వెళ్లి స్వయంగా ఆన్ చేస్తే తప్పా పునరుద్ధరణ జరిగేది కాదు. తాజా చర్యలతో పవర్ కట్ జరిగితే క్షణాల్లో జనరేటర్ ఆన్ కానున్నది. కాగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని రకాలుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనీల్‌కుమార్ స్పష్టం చేశారు.

గుమ్మడిదల రైతులకు న్యాయం చేయాలి

- కలెక్టర్‌ను కోరిన హరీశ్‌రావు

గుమ్మడిదల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల తరహాలో గుమ్మడిదలలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సోమవారం రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటి వద్ద ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. రైతుల వేదన విన్న హరీశ్‌రావు వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 109 సర్వేలో భూములు కోల్పోతున్న రైతులకు ఒక్కో రైతుకు 600 గజాల భూమిని ఇవ్వాలని నిర్ణయించామని, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా లగచర్లలో రైతులకు పరిహారం చెల్లించి ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే తరహాలో గుమ్మడిదల రైతులకూ న్యాయం జరగాలని కలెక్టర్‌ను కోరారు. హరీశ్‌రావును కలిసిన వారిలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి రాష్ట్ర నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన గుమ్మడిదల రైతులు, నాయకులు

WANTED

★ SBI LIFE ఇన్సూరెన్స్ గజ్వేల్ బ్రాంచ్ నందు పనిచేయుటకు Marketing - ఏజెన్సీ మేనేజర్స్ కావలెను. On Roll Job (Exp: 1-2 years) జీతము 20000 to 30000/- వరకు ఇవ్వబడును. Cell No.9866373434 AJH-198585

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఏడి పింఛన్

పోస్టాఫీసు ద్వారా పెన్షన్ పొందే లబ్ధిదారుల అవస్థలు

నెలలో నాలుగు రోజులే ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పోస్టల్ శాఖ

నర్సాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ప్రభుత్వం నెలనెల అందించే పింఛన్ డబ్బుల కోసం పోస్టల్ శాఖ చుక్కలు చూపెడుతున్నది. పింఛన్ అందితేనే అవసరాలు తీరే నిరుపేదలైతే ఎప్పుడెప్పుడొస్తాయా అని ఎదురుచూస్తుంటారు. పింఛన్ డబ్బు వచ్చాయనగానే డబ్బులు తీసుకోవడానికి పోస్టాఫీసుకు పరుగులు పెడుతుంటారు. కానీ పోస్టాఫీసు కార్యాలయం వారు మాత్రం నెలలో నాలుగు రోజులు మాత్రమే పింఛన్ డబ్బు చెల్లించి, తర్వాత వచ్చిన వారికి మొండిచేయి చూపెడుతున్నారు. నర్సాపూర్ పోస్టల్ శాఖ పరిధిలో పింఛన్ పొందే వారికి ఆ శాఖ చుక్కలు చూపుతు గోస పెడుతుంది.

నర్సాపూర్ పోస్టల్‌శాఖ పరిధిలో ఉన్న కౌడిపల్లి, నర్సాపూర్, గుమ్మడిదల బ్రాంచుల పరిధిలోని వారికి పింఛన్ డబ్బులు పోస్టల్‌శాఖలో పని చేసే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ద్వారా లబ్ధిదారులకు అందజేస్తారు. ఇలా పోస్టల్‌శాఖ ద్వారా పొందే వారు నర్సాపూర్ పట్టణంలోనే 1600 మంది వరకు ఉన్నారు. 16 బీపీఎంల పరిధిలో ఒక్కో బీపీఎంకు 300 నుంచి 600 మంది వరకు పెన్షన్‌దారులు ఉంటారు. నెలనెల మంజూరయ్యే పెన్షన్‌ను నెల అంతా ఇవ్వాల్సి ఉండగా పోస్టల్‌శాఖ మాత్రం నెలలో నాల్గుఐదు రోజులకు మించి అది కూడా చివరి తేదీల్లో ఇస్తూ చేతులు దులుపుకుంటుంది. మే నెలలో పింఛన్ డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో 26వ తేదీన వేయగా, 27వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. డబ్బులు పడ్డట్టు తెలిసిన వారు



నర్సాపూర్ పోస్టాఫీసుకు వచ్చి నిరాశతో వెళ్తున్న లబ్ధిదారులు

ఆయా బీపీఎంల వద్దకు వెళ్లి తీసుకోగా, ఇంకా తీసుకోని వారు చాలా మంది ఉన్నారు. దీంతో మే నెల దాటి జూన్ నెల రాగా, బీపీఎంలు పింఛన్‌ను పంపిణీ చేయడం లేదు. తమ డబ్బు ఇవ్వాలని పోస్టాఫీసుకు, బీపీఎంల వద్దకు వెలితే నెల అయిపోయింది ఇక రావంటు పంపిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్‌శాఖ వ్యవహారం వల్ల గ్రామాల్లో పనిచేసే బీపీఎంలు స్థానిక పెన్షన్‌దారుల చేత చివాట్లు తినాల్సిన పరిస్థితి నెలకొంది. నెలనెల వచ్చే పెన్షన్ డబ్బులను నెలాఖరున నాల్గు ఐదురోజులు కాకుండా మొదటి తేదీ నుంచి నెలాఖరు వరకు ఏ రోజు వచ్చిన ఇచ్చేటట్టు చూడాలని ఎన్నిమార్లు పోస్టల్ శాఖ అధికారులను ప్రజాప్రతినిధులు కోరినా తమ ధోరణిని మార్చుకోవడం లేదు. దీంతో పింఛన్ మీదనే ఆధారపడి ఉండే లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావు.

బహిరంగ ప్రకటన

ICICI Bank సమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007 కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో జూన్ 13, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: హైదరాబాద్ - గచ్చిబౌలి	
111457000063	జి. రామ గణపతి నరసింహ రాజు
శాఖ పేరు: ఖమ్మం	
068462006950	సంటిప్ రెడ్డి లింగాల
శాఖ పేరు: హైదరాబాద్ - నల్లగండ్ల	
437562000772	కావేటి భరత్ భూషణ్
శాఖ పేరు: చండూర్‌పేట	
220162001805	మిట్టపల్లి మంగమ్మ
శాఖ పేరు: ఆరెపేట	
220062002259	పిల్లి గంగ మల్లు
శాఖ పేరు: హైదరాబాద్ - ఎపిఆర్ నగర్	
477862000015	జవన్ మనోహర్
శాఖ పేరు: వరంగల్ - కాజీపేట రోడ్	
230362003270	ముల్కల్ల శ్రావణ్ కుమార్
శాఖ పేరు: రామంతపూర్	
223457000029	చెరుకు శ్రావణ్ కుమార్ రెడ్డి
శాఖ పేరు: తాండూరు	
379857000097	సురేష్ కుమార్
శాఖ పేరు: నాగర్ కర్నూల్	
377757000122	తెప్ప రామ మూర్తి

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: నిజామాబాద్	
395857000046	రొంపల్లి కార్తీక్
395857000049	రొంపల్లి కార్తీక్
శాఖ పేరు: హైదరాబాద్ - మధురానగర్	
543462000052	ఉదయగిరి ఈశ్వర్
శాఖ పేరు: హైదరాబాద్ - మియాపూర్	
111262003466	పవన్ కుమార్ విజయగిరి
శాఖ పేరు: హైదరాబాద్ - హఫీజ్‌పేట్	
492262000109	పవన్ కుమార్ విజయగిరి
శాఖ పేరు: కోదాడ - తెలంగాణ	
363357000024	షేక్ అబ్దుల్ సాజిద్
363362004974	షేక్ అబ్దుల్ సాజిద్
శాఖ పేరు: ఘట్‌కేసర్	
179362007623	నవీన్ కుమార్ పుదుత
శాఖ పేరు: హైదరాబాద్ - శేరిలింగంపల్లి	
131757000085	హేమంత్ రెడ్డి అనిరెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్ - గచ్చిబౌలి	
111462005940	గంగసాని వెంకటరెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్ - కొత్తకోట	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
386862001407	తూరుపు నవీన్ కుమార్‌రెడ్డి
386862001433	తూరుపు నవీన్ కుమార్‌రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్ - కావూరి హిల్స్	
112062003142	యల్ల వెంకటేష్
శాఖ పేరు: పరకాల	
749262003055	బొజ్జం శ్రీకాంత్
శాఖ పేరు: హైదరాబాద్ - బొటానికల్ గార్డెన్స్	
437457000040	సూర్జిత్ బసంతరాయ్
శాఖ పేరు: హైదరాబాద్ - సిద్దిపేట, మెదక్ రోడ్	
753662000014	నీలం ఈశ్వర్
753662000036	నీలం ఈశ్వర్
శాఖ పేరు: నిజామాబాద్	
395857000060	షేక్ ఇర్ఫాన్
395857000009	తెరిగూడెం మహేష్ రెడ్డి
శాఖ పేరు: జమ్మికుంట	
412762004566	వేముల ప్రవీణ్
శాఖ పేరు: బోధన్	
376962007111	జక్కిన సత్తిబాబు
శాఖ పేరు: దోంబివలి - షీల్ ఫాటా	
340462002408	వెంకటేష్ డి
శాఖ పేరు: నెల్లూరు	
631062022695	భానుశంకర్ కరు

తేది : 03.06.2025

ప్రదేశం: హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, రంగారెడ్డి, హన్మకొండ, మెదక్, సిద్దిపేట, కరీంనగర్, రాజన్న (సిరిసిల్ల), జగిత్యాల, ఖమ్మం, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

న్యూస్ బాక్స్

ప్రజలకు చేరువలో గృహ నిర్మాణ శాఖ

మెదక్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత చేరువలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయం రూపుదిద్దుకుంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ రెండు అంతస్తులో కేటాయించిన ఎంపీడీవో హౌసింగ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై ప్రజలకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. సమయ పాలనతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, హౌసింగ్ పీడీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాకు యత్నం.. రోడ్డు ఏర్పాటు

వెల్దుర్తి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి ఖాన్‌చెరువులో వెల్దుర్తి పట్టణానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ నర్సింలు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లడానికి రోడ్డును నిర్మించి చెరువు కబ్జాకు యత్నిస్తున్నాడని సోమవారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం వల్ల వర్షపు నీరు చేరే అవకాశం తక్కువగా ఉంటుందని, పంట పొలాల సాగు నీరు అందదన్నారు. అధికారులు స్పందించి చెరువులో ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించి కబ్జా నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కుంటకట్ట నక్ష రోడ్డు పునరుద్ధరణ

శివ్వంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన కుంటకట్ట నక్ష రోడ్డును పునరుద్ధరించారు. అలాగే ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి కరీం కుంట వెళ్లే నక్ష రోడ్డు ఆక్రమణకు గురైంది. ఈ విషయమై కుంట ఆయకట్టు రైతులు, గంగపుత్ర సంఘం నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కమలాద్రి సర్వే నిర్వహించి కుంటకట్టను ఎక్స్‌కవేటర్‌తో పునరుద్ధరించి, ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రధాన గేటు నిర్మాణాన్ని తొలగించారు. ఇదిలా ఉండగా ఓ వెంచర్ నిర్వాహకులు సర్వే చేయకుండా తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్నారు.

జిల్లా కురుమ సంఘం పదవులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కురుమ సంఘం పదవులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు షెపర్డ్ జిల్లా కో ఆర్డినేటర్ కురుమ సంఘం బీరయ్యయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీలోగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఉత్సాహం కలిగిన సంఘం నిర్మాణానికి ఐక్యతతో పాటుపడే అభ్యర్థులు గోకుల్ హాస్పిటల్‌లో ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 6న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆర్టీసీ ఆర్ఎం బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ మెదక్ రీజినల్ మేనేజర్‌గా విజయభాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బస్‌భవన్‌లో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌గా పనిచేస్తూ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పరిశ్రమ బస్సుకు తప్పిన ప్రమాదం

మనోహరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఓ పరిశ్రమకు చెందిన బస్సు సోమవారం ఉదయం జాతీయ రహదారిపై అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. పరిశ్రమ వారు తెలిపిన ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి లామ్‌కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ పరిశ్రమకు చెందిన బస్సు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ నుంచి సుమారు 15 మంది పరిశ్రమ సిబ్బందిని తీసుకొస్తున్నది. ఈ క్రమంలో బస్సు మండలంలోని కూచారం చౌరస్తా 44 వ జాతీయరహదారి వద్దకు రాగానే లారీ అడ్డు రావడంతో అదుపు తప్పిన బస్సు రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరి తలకు గాయాలు కాగా, మిగతా కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్సును అక్కడి నుంచి తరలించారు.

డబ్బులు ఇవ్వాలని ఉపాధి కూలీల ఆందోళన

శివ్వంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పది వారాలుగా ఉపాధిహామీ డబ్బులు ఖాతాలో పడక ఇబ్బందులు పడుతున్నామని నవాబ్‌పేట గ్రామంలో ఉపాధిహామీ కూలీలు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి డబ్బులకు 10 వారాలుగా రావడం లేదని వాపోయారు. ఈ విషయమై ఏపీవో అనిల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఎంపీడీవో నాగేశ్వర్‌ను సంప్రదించగా నిధుల కొరతతో పైనుంచే నిధులు రాలేవని తెలిపారు.

నలగండ్ల మల్లన్న కల్యాణ వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : శేరిలింగంపల్లి మండలంలోని నలగండ్లలో సోమవారం జరిగిన మల్లన్న కల్యాణోత్సవంలో తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మల్లన్న దేవుడికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ మహీన్‌గౌడ్ పాల్గొన్నారు.



నలగండ్లలో మల్లన్న కల్యాణోత్సవంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

భూములకు పరిహారం ఇప్పించండి

● నర్సారెడ్డికి ఘనపూర్ పేదల వినతి

తూప్రాన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపనకు భూములు సేకరిస్తున్న అధికారులు పరిహారం ఇవ్వడం లేదని తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తూప్రాన్‌లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో సర్వే నంబరు 393లో పేదలకు 2005లో వ్యవసాయ భూమిని పంపిణీ చేసి పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది పేదలకు భూములున్నపటికీ పరిహారం అందజేయడం లేదని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిహారం అందజేసేటట్లు చూస్తానని నర్సారెడ్డి వారికి హామీఇచ్చారు.

పీసీబీ అధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హత్నూర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల పరిశ్రమల నుంచి విడుదలవుతున్న జల, వాయు కాలుష్యంపై పీసీబీ అధికారులు సోమవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. పరిశ్రమల కాలుష్యంపై ఆంధ్రజ్యోతిలో 'విషం చిమ్ముతున్నాయ్' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన పీసీబీ ఏఈ శ్రవణ్‌కుమార్ సోమవారం గుండ్లమాచునూర్ గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. అదేవిధంగా గ్రామస్థులతో మాట్లాడారు. కాలుష్య తీవ్రతను తెలిపే పరికరాలతో పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. వన మహోత్సవం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీని జెండా ఊపికి ప్రారంభించి మాట్లాడారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే అతివృష్టి, అనావృష్టిలు సంభవిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగల్‌గిద్ద మండలంతో పాటు కిషన్‌నాయక్‌తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో మహేశ్వర్, తహసీల్దార్ శివక్రిష్ణ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ పండరినాథ్‌రావు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

● మంత్రికి ప్రభుత్వ వైద్యుల సంఘం విజ్ఞప్తి



సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీజీజీడీఏ) వైద్యులు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. సోమవారం సంగారెడ్డిలోని మంత్రి దామోదర నివాసంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ వైద్యులు అత్యవసర సమావేశమయ్యారు. టీవీవీపీ కమిషనర్ డా.అజయ్‌కుమార్ కూడా సమావేశానికి హాజరయ్యారు. రెండు రోజుల కిందట జహీరాబాద్ ఆస్పత్రిలో జరిగిన సంఘటనకు సంబంధించి వాస్తవాలను టీజీజీడీఏ వైద్యులు మంత్రికి వివరించారు. ఓపికగా సానుభూతితో విన్న మంత్రి సస్పెన్షన్ ఉపసంహరణకు అంగీకరించారని టీజీజీడీఏ వైద్యులు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల టీజీజీడీఏ వైద్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రితో సమావేశమైన వారిలో టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.నరహరి, సెక్రటరీ జనరల్ డా.లాలుప్రసాద్‌రాథోడ్, కోశాధికారి డా.ఎం.కె.రవూఫ్, సీఈసీ సభ్యుడు డా.రాజశేఖర్, మెదక్ జిల్ల అధ్యక్షుడు డా.విష్ణువర్ధన్, జనరల్ సెక్రటరీ డా.శంకర్, కోశాధికారి డా.గోవింద్, డా.శ్రీధర్, డా.మహ్మద్‌అలీ తదితరులు ఉన్నారు.

బేగంపేటలో ఫ్లాగ్ కోడ్ యాక్ట్ ఉల్లంఘన!

● ప్రత్యేక అధికారికి బదులు.. కాంట్రాక్టు ఉద్యోగి జాతీయజెండా ఎగురవేత



బేగంపేటలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ కాంటాక్టు ఉద్యోగి గురుపాదం

కంది, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్లలో దూరంలో ఉన్న కంది మండలంలోని బేగంపేటలో ఫ్లాగ్ కోడ్ యాక్ట్ ఉల్లంఘన జరిగిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. బేగంపేట గ్రామ కార్యదర్శి తారబాయి తన బంధులు చనిపోయారని సోమవారం సెలవు పెట్టారు. ఆ గ్రామానికి ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీడీవో శ్రీనివాస్ అక్కడి వెళ్లలేదు. దీంతో ఎన్ఆర్ఈజీఎస్‌లో కాంట్రాక్టు ఉద్యోగి గురుపాదంతో జెండాను ఎగురవేశారు. ఆ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుమారం రేపింది. గురుపాదంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అంతదూరం వెళ్లాలంటే తనకు సమయం సరిపోలేదని, అందుకే ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగి గురుపాదంకు జాతీయ జెండా ఆవిష్కరించాలని తానే చెప్పానని తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

గుమ్మడిదల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొంతపల్లి గ్రామంలో ఎల్లమ్మ, పోచమ్మ, చిత్తారమ్మ నాగ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాట సుధా పాల్గొని పూజలు చేశారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

జిన్నారం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ అల్లీనగర్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సోమవారం అల్లీనగర్ 27 సర్వే నెంబరులో చేపట్టిన పలు అక్రమ కట్టడాలు, బెస్మెట్లను ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా కృషి

● సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తున్నదని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 5న మహీంద్ర కర్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సోమవారం కర్మాగారం వద్ద కార్మికులతో గేట్‌మీటింగ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం అభ్యర్థి జనక్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కార్మికుల శ్రేయస్సుకోసం నిరంతరం కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంఆర్ఎఫ్ కర్మాగారం అధ్యక్షుడు పెద్దగొల్ల శేఖర్, సీడీసీ చైర్మన్ ముబీన్, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే

హవేళిఘణపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పాడిపంటలతో సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని గాజిరెడ్డిపల్లి తండాలో నిర్వహిస్తున్న జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాం, పార్టీ మండలాధ్యక్షుడు పరశురాం, నాయకులు పాల్గొన్నారు.

వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయండి

సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు 2 వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని నూతన అధ్యాపకులు కోరారు. ఈ విషయమై సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో)కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మే 4వ తేదీతో ఎలాంటి క్రమశిక్షణ కేసులు లేకుండా సంతృప్తికరంగా రెండేళ్ల ప్రొబెషనరీ పిరియడ్ పూర్తి చేసుకున్నామని, అయితే కొంతమంది ప్రిన్సిపాల్స్ 2వ వార్షిక ఇంక్రిమెంట్లను వేతన బిల్లుతో కలిపి చేయడం లేదని వాపోయారు. ఇంక్రిమెంట్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా నూతన అధ్యాపకులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి స్పాట్ విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో నర్సారెడ్డి



విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

మనోహరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నారు. సోమవారం మూడోరోజు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో 'శ్రీ అక్షయ' కళాశాలకు ర్యాంకులు




స్టాలిన్, రోహిత్‌గౌడ్

సంగారెడ్డి అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్-2025 ఫలితాల్లో కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీఅక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారు. ఎస్‌సీ కేటగిరీ విభాగంలో తుడుం స్టాలిన్ 205, ఓబీసీ కేటగిరీ విభాగంలో జి.రోహిత్‌గౌడ్ 8866 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, అకాడమిక్ డైరెక్టర్ భానచందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజుగౌడ్ అభినందించారు.

ఐఐటీజేఈఈలో సత్తా చాటిన సాత్వికారెడ్డి

నారాయణఖేడ్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం హంగర్గ.బి గ్రామానికి చెందిన సాత్వికారెడ్డి ఆలిండియా స్థాయిలో 192వ ర్యాంకు సాధించింది. గతంలో కూడా ఈ విద్యార్థిని ఎప్‌సెట్‌లో 400 ర్యాంకు, ఐఐటీ మెయిన్స్‌లో 99.87 శాతం మార్కులు సాధించింది.

విజన్ 2047

(5వ పేజీ తరువాయి)

...నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యం

కొత్తగా పది 108 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చాం. సంగారెడ్డి జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను పటాన్‌చెరు, అందోలు, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

నిమ్జ్ ప్రాజెక్టుతో 15 లక్షల మందికి ఉపాధి

జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్కల్ మండలాల పరిధిలో 12,500 ఎకరాల విస్తీర్ణంలో రూ. 17,303 కోట్ల అంచనాతో ఏర్పాటు చేయదల్చిన 'నిమ్జ్' నిర్మాణాన్ని 2040 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటి వరకు 6,100 ఎకరాల భూమిని సేకరించాం. జాతీయ రహదారి నుంచి నిమ్జ్‌ను అనుసంధానించే 9 కి.మీ.ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశాం. నిమ్జ్ ఏర్పాటు పూర్తయితే ప్రత్యక్షంగా 15లక్షల మందికి, పరోక్షంగా 20లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుశాఖ సమర్థంగా వ్యవహరిస్తున్నది. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నాం.

భూ సమస్యల పరిష్కారానికి కొత్త చట్టం

భూ సమస్యల పరిష్కారానికి కొత్తగా భూ భారతి ఆర్ఓఆర్ -2025 చట్టాన్ని తీసుకువచ్చాం. పైలట్ ప్రాజెక్టుగా కొండాపూర్ మండలాన్ని ఎంపికచేసి, 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన అర్జీలను స్వీకరించాం. మిగిలిన మండలాల్లో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం.

సంక్షేమంలో అగ్రగామి

(5వ పేజీ తరువాయి)

ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. రైతుల భూవివాదాలను పరిష్కరించి, వారి భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండడానికి భూభారతి ఆర్వోఆర్ 2025 చట్టం అమలులోకి తెచ్చామని వివరించారు. ఈ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలు ప్రదర్శించారు. చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే విన్యాసాలు అబ్బురపర్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

● నీలం మధుముదిరాజ్



చిట్కుల్ క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా చిట్కుల్ అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాలకు గుర్తు తెలంగాణ రాష్ట్రమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్, సుధాకర్‌రెడ్డి, ముత్తంగి అశోక్, షేక్ అజ్జు, వెంకటేష్, మురళి, సురేష్, శ్రీనివాస్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే అమరవీరుల స్తూపాలకు నివాళులర్పించారు. అనేక త్యాగాలు, బలిదానాల ఫలితంగా తెలంగాణ ఆవిర్భవించిందని పలువురు పేర్కొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



పటాన్‌చెరు : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకం ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఖేడ్‌లో జాతీయ పతాకం ఎగురవేసి నాయకులతో కలిసి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జహీరాబాద్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



చిన్నశంకరంపేట: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు